వైకుంఠం.. వైభోగం



విశేష అలంకరణలో స్వామివారి దర్శనం

రంగారెడ్డినగర్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా వైష్ణవ దేవాలయాల్లో విశేష పూజలు జరిగాయి. ఆయా ఆలయాల వద్ద ఉత్తర ముఖ ద్వారం ఏర్పాటు చేయగా.. భక్తులు పెద్దసంఖ్యలో క్యూ కట్టి స్వామివారిని దర్శించుకున్నారు. జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, కుత్బుల్లాపూర్ వేణుగోపాలస్వామి ఆలయం, గోదావరి హోమ్స్, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, మెట్‌కానిగూడలోని శ్రీ నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం, హెచ్‌ఎంటీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద..



భక్తులతో కిటకిటలాడిన గోదావరి హోమ్స్ వెంకటేశ్వరస్వామి ఆలయం



వేణుగోపాలస్వామిని దర్శించుకున్న డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్



బీఆర్‌ఎస్ రంగారెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య



గోదావరి హోమ్స్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో..



కుత్బుల్లాపూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో భజన కీర్తనలు ఆలపిస్తూ..



గాజులరామారం నల్లగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో..



నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి తదితరులు

దుకాణదారులు సమయపాలన పాటించాలి



జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్

జీడిమెట్ల: దుకాణాలు, హోటళ్లు, వ్యాపార సముదాయాల నిర్వాహకులు సమయపాలన పాటించాలని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ అన్నారు. ఇప్పటికే జీడిమెట్ల పోలీసులు సమయపాలన పాటించని మూడు దుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. అయోధ్యనగర్‌లోని కిరాణషాపు, చింతల్‌లోని ఓ దుకాణం, బేకరీ యజమానులపై కేసులు నమోదు చేశారు.

పాటించాల్సిన సమయాలు..

చిన్న చిన్న దుకాణాలు రాత్రి 11 గంటల వరకు, బార్లు, రెస్టారెంట్లు రాత్రి 12 గంటల వరకు మాత్రమే నిర్వహించాలని తెలిపారు. సమయపాలన దాటి ఎవరైనా దుకాణాలు తెరచి ఉంచితే ఖచ్చితంగా కేసులు నమోదవుతాయని సీఐ స్పష్టం చేశారు. దుకాణాలు తెరచి ఉంటే జనాలు బయట తిరిగే అవకాశం ఉందని, దుకాణాల యజమానులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన స్థానికులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. శనివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ లైన్లను ఏర్పాటు చేయాలని కోరగా రాజు సానుకూలంగా స్పందించినట్టు సమచారం.

పటిష్టంగా ఉండాలంటే.. పట్టించుకోవాల్సిందే..



సుభాష్‌నగర్: స్థానికంగా ఏదైనా ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపడితే తనకేమిటే అనుకునేవారు చాలామంది ఉంటారు. అభివృద్ధి పనులు పదికాలాల పాటు పటిష్టంగా ఉండాలని వాటి బాగోగులు పట్టించుకునే వారిలో తక్కువ మంది ఉంటారు. అదే కోవకు చెందినవారు గాజులరామరాజు బతుకమ్మ బండ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చెట్ల వెంకటేష్ అని చెప్పుకోవచ్చు. బస్తీలో ఏ అభివృద్ధి పనులు చేపట్టిన అతను దగ్గరుండి ప్రత్యేక శ్రద్ధ వహిస్తాడు. ఇటీవల స్థానికంగా సీసీరోడ్డు పనులు జరగడంతో గట్టిపడడానికి ప్రత్యేకంగా తడి గోనె సంచులు వాటిపై వేసి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడు. బస్తీలో ఏ అభివృద్ధి పనులు చేపట్టిన ఆయన తన వంతుగా దిశా నిర్దేశం చేస్తున్నాడు.

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి



కుత్బుల్లాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో అవగాహన కల్పిస్తున్న మహిళా సాధికారత సభ్యులు

కుత్బుల్లాపూర్: విద్యార్థినులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని, ఏవైనా ఇబ్బందులు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని మహిళాసాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ వాసవి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'భేటీ బచావో.. భేటీ పడావో' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కేంద్రం సభ్యులు సవిత, శ్రావణిలు మాట్లాడుతూ.. బాలికలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని, అబ్బాయిలతో సమానంగా క్రీడల్లో రాణించాలన్నారు. వాసవి మాట్లాడుతూ.. బాలికలను వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా.. తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. 'గుడ్ టచ్' 'బ్యాడ్ టచ్', సఖి సేవలు, చైల్డ్ హెల్ప్‌లైన్, చైల్డ్ రైట్స్, సైబర్ క్రైమ్, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆపదలో 100, 181, 1098, 14567 హెల్ప్‌లైన్‌లకు ఫోన్‌చేస్తే పరిష్కరిస్తామన్నారు. పాఠశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్‌లకు మీటర్లు ఏర్పాటు చేసుకోవాలి



సూరారం సెక్షన్‌లో స్థానికులతో మాట్లాడుతున్న జీఎం శ్రీధర్‌రెడ్డి

చింతల్: నీటి వినియోగదారులు తప్పనిసరిగా నల్లా కనెక్షన్లకు మీటర్లను ఏర్పాటు చేసుకోవాలని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సూరారం సెక్షన్ పరిధిలోని పలుబస్తీలు, కాలనీలలో శనివారం జీఎం శ్రీధర్‌రెడ్డి మేనేజర్ అనూషతో కలిసి పర్యటించారు. స్థానికంగా నీటిసరఫరా జరుగుతున్న తీరుపై వినియోగదారులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. నీటిని నాణ్యత పరికరాల ద్వారా పరీక్షించి వినియోగదారుల సమస్యలను పరిష్కరించారు. సెక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. సేఫ్టీ పరికరాలతోనే పనులు చేపట్టాలని, పనులు జరిగే ప్రాంతాల్లో సేఫ్టీ బోర్డులు, రిబ్బన్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని సూచించారు.



రంగారెడ్డినగర్‌కు వెళ్లే దారిలో ఇలా..

పేరుకుపోతున్న వ్యర్థాలు

దుర్గంధంతో ప్రజలకు తీవ్ర ఇబ్బంది



గాంధీనగర్ రోడ్డు పక్కనే పారవేస్తున్న వ్యర్థాలు

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్లపై రోజుల తరబడి వ్యర్థాలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్, ఏపీహెచ్‌బీ కాలనీ, రంగారెడ్డినగర్ ప్రధాన రహదారుల్లో చెత్తను తరలించడంలో పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. వ్యర్థాలతో దోమలు వృద్ధి చెంది ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నా.. అధికారులకు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర అప్పులపై ఓయూలో వినూత్న చర్చ

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్‌ఎస్ పాలనలో ప్రభుత్వం చేసిన రూ.6,71,757 కోట్ల అప్పుల పై ఓయూలో వినూత్నంగా బహిరంగ చర్చ జరిగింది. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట పీహెచ్‌డీ విద్యార్థి, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చర్చ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ప్రొఫెసర్లు పాల్గొని చర్చించారు. మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల అహంకారపూరిత పాలనలో వైఫల్యాలు, కమీషన్ల కోసం అను ఉత్పాదక రంగాలపై అధిక పెట్టుబడులు పెట్టి తద్వారా ఆర్థిక దోపిడీ అనే అంశాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. వర్సిటీలను పునఃనిర్మించుకొని నాణ్యత ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యా పరిశోధనలను పెంచి సమాజానికి దేశ ప్రగతికి దోహదపడేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ఆశ భావాన్ని వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం సుస్థిరమైన అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులతో పాటు విద్యార్థి నేతలు మేడ శ్రీనివాస్, బొమ్మర సమ్మయ్య, నెల్లి సత్య, ఉదయ్, సుమన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిభ కళాశాల (సీఓఈ)ల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరడానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ గణేష్ తెలిపారు. జనవరి 15 చివరి తేదీ అని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. ఇంటర్‌తోపాటు జేఈఈ, మెడికల్ నీట్, ప్రవేశ పరీక్షలకు కూడా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారని వివరించారు. అదేవిధంగా సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 5వ తరగతిలో చేరేందుకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదివే విద్యార్థులు జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఈ ప్రాంత క్రీడాకారులకు గుర్తింపు తేవాలి

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ హాకీ అధ్యక్షుడుగా ఎన్నికైన కొండ విజయ్‌కుమార్‌ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ మన ప్రాంతానికి చెందిన హాకీ క్రీడాకారులకు గుర్తింపు వచ్చేలా కృషి చేయాలని, తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని చెప్పారు.

తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు సత్కారం



ఆలింగనం చేసుకుంటున్న మాజీ డీసీసీ అధ్యక్షుడు కే.ఎం.ప్రతాప్

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శనివారం రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కే.ఎం.ప్రతాప్ మర్యాదపూర్వకంగా కలిశారు. స్పీకర్‌ను శాలువతో సత్కరించి ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, బిజిలి కృష్ణ, మహమ్మద్ పాషా, నక్క ప్రకాష్, మాద రమేష్, ఓంప్రకాష్, ఉల్పి వెంకటేష్, జిట్టా రామేశ్వర్‌రెడ్డి, ఊరడి మల్లికార్జున్, జిట్టా బలవంత్‌రెడ్డి, కన్నా, రాజ్‌ఠాకూర్, యువనేస్త వ్యవస్థాపకుడు కేపీ విశాల్‌గౌడ్ తదితరులున్నారు.

ఉల్లాసంగా యువజన ఉత్సవాలు

కలెక్టరేట్‌లో ప్రారంభించిన డీఆర్‌వో

సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా జిల్లాలోని యువతీ యువకులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు.ఇందులో ప్రధానంగా జానపద గీతాలు, జానపద నృత్యాలు, కథా రచనలు, పోస్టర్ మేకింగ్,ఫొటోగ్రఫీ అంశాలున్నాయి.పోటీలను డీఆర్‌వో హరిప్రియ ప్రారంభించగా శామీర్‌పేట జెడ్పీటీసీ జ్యోతి వెలిగించారు. జిల్లావ్యాప్తంగా వివిధ విద్యా సంస్థలు, అసోసియేషన్స్ నుంచి దాదాపు 200 మంది యువతీ, యువకులు పాల్గొన్నారు. పోటీల్లో జిల్లాస్థాయి విజేతలను ఎంపిక చేసి, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నారు. వివిధ అంశాలలో నిర్వహించిన పోటీల్లో విన్నర్స్, రన్నర్స్‌తో కలిపి 30 మంది యువతీ, యువకులు గెలుపొందారు. పోటీల్లో గెలుపొందిన విన్నర్స్, రన్నర్స్‌కు జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, జిల్లా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ ఆఫీసర్ వినోద్ కుమారులు సర్టిఫికెట్స్, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి బలరామారావు, శాఖ అధికారులు జానకి రాములు, సిబ్బంది సాయి కుమార్, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సమస్యలపై 'ప్రాశో' ప్రత్యేక దృష్టి



గచ్చిబౌలిలో 'ప్రాశో' కార్యాలయం ప్రారంభోత్సవంలో సంస్థ ప్రతినిధులు

గచ్చిబౌలి: అపారమైన సవాళ్లను విసిరే ప్రజా ఆరోగ్య సమస్యల పట్ల 'ప్రాశో' ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య సలహాదారు ఆర్ గోవింద్‌హరి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి గచ్చిబౌలిలోని కావూరిహిల్స్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ప్రాశో అనే స్వచ్ఛంద సంస్థ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. నగరంలో ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి సంస్థ కృషి చేయనుంది. ప్రాశో అంటే నివారణ, ఆరోగ్యం, సాక్ష్యం–ఆధారిత ప్రాక్టీస్, వికలాంగులు, బలహీన సమూహాలకు మద్దతు ఇవ్వడం లాంటి కార్యక్రమాలు చేపడతారన్నారు. స్టాన్‌ఫోర్డ్ పరిశోధకులు ప్రొఫెసర్ జీవీఎస్‌మూర్తి మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో పరివర్తనాత్మక మార్పును తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ కేర్ ప్రతినిధులు, నగరంలోని ప్రముఖ ఆస్పత్రుల డాక్టర్లు జెలా లెంటఫెస్సే, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ జగన్నాథ్, డాక్టర్ రఘునాథ్, డాక్టర్ భాస్కర్‌రావు, డాక్టర్ సలీల్, డాక్టర్ రామ్‌జీసింగ్, రఘునాథ్, డా.శివరంజనితోపాటు పలు వురు డాక్టర్లు పాల్గొన్నారు.

కోవిడ్ చికిత్సకు సర్వం సిద్ధం

- మూడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో 70 పడకలతో ప్రత్యేక వార్డులు
- ఆక్సిజన్ కొరత లేకుండా చర్యలు
- నిర్ధారణ పరీక్షలకు ప్రత్యేక విభాగం
- అప్రమత్తమవుతున్న వైద్యాధికారులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో మరోమారు కోవిడ్ కేసులు బయట పడుతుండటంతో వైద్యాధికారులు అప్రమత్తం అవుతున్నారు. గతంలో కోవిడ్ మొదటి, రెండో విడత వ్యాప్తిని దృష్టిలో పెట్టుకుని మల్కాజిగిరి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో 50 పడకలు, ఘట్‌కేసర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 10, మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 10 పడకలతో ప్రత్యేక వార్డులను సిద్ధం చేశారు. అలాగే, 108 బస్తీ దవాఖానాలు, 38 ప్రభుత్వ గ్రామీణ/పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు 126 ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా కోవిడ్ వైద్య చికిత్సల కోసం ఏర్పాట్లు చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కరోనా చికిత్స కోసం మొత్తంగా 8,197 పడకలను సిద్ధం చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి తెలిపారు. ఒక్కో పడకకు విధిగా ఆక్సిజన్ సదుపాయం కల్పిస్తున్నారు. ఐసీయూ విభాగంలో 408 వెంటిలేటర్లు అందుబాటులో ఉంచారు.

ఆక్సిజన్ కొరత లేకుండా..

- కరోనా తొలి విడతలో తీసుకున్న చర్యలు ఇప్పుడు కూడా అమలు చేయనున్నారు.

ఆక్సిజన్ కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆక్సిజన్ సపోర్టు ఉన్న పడకలను 2,541 సిద్ధం చేసినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. వార్డుల్లో రోగులకు సేవలందించేందుకు 2,071మంది వైద్యులు, 3,261మంది నర్సులు, 1,374 మంది పారామెడికల్ సిబ్బందితో సహా అంగన్‌వాడీ, ఆశా వర్కర్స్, శానిటేషన్ సిబ్బందిని కేటాయించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశారు.

నిర్ధారణ పరీక్షలకు..

- ప్రభుత్వ ఆస్పత్రిలో కోవిడ్ నిర్ధారణ పరీక్షల నిర్వహణకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. అలాగే, పీపీఈ కిట్లు 33,988, ఎన్–95 మాస్కులు 55,681 అందుబాటులో ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. శ్వాసకోశ సహాయక పరికరాలు కూడా అందుబాటులో ఉంచారు. ఇందులో వెంటిలేటర్లు 407, నెబ్యులైజర్లు 1,134, ఆక్సిమీటర్లు 3,400, ఆక్సిజన్ కాన్సంటెటర్లు 1,129, ఆక్సిజన్ సిలిండర్లు 4,967 అందుబాటులో ఉంచినట్లు వైద్యశాఖ వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శనివారం ప్రగతినగర్‌లో జరిగిన కార్యక్రమంలో వాసుమిత్ర బృందం ఆధ్వర్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కొలన్ హన్మంతరెడ్డి, సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డిలు కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్పొరేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

విద్యార్థికి బహుమతి ప్రదానం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న కళాశాల డైరెక్టర్లు అనుశ్రేయరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫార్మసి కళాశాలల్లో శనివారం ×ట్రెడిషనల్ డే×ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కళాశాల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అనుశ్రేయ రెడ్డి, డైరెక్టర్ కే.వేంకటేశ్వరరెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపాల్ అర్ణబ్ మాలిక్ పాల్గొన్నారు.

భగవద్గీత పఠనం



చింతల్: ప్రతి ఒక్క హిందువు భగవద్గీతను చదవాలని ధర్మశాస్త్ర సేవా సమితి భగత్‌సింగ్‌నగర్ కమిటీ సభ్యులు అన్నారు. శనివారం చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో శ్రీ ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం హరిహర క్షేత్రంలో గీతాజయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 108 మందితో భగవద్గీత పారాయణం నిర్వహించి వారికి భగవద్గీత పుస్తకాలను అందజేశారు. ధర్మశాస్త్ర సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్క హిందువు భగవద్గీత విశిష్టతను తెలుసుకుని భగవద్గీతను పూర్తిగా చదవాలన్నారు. పురాణాలు, వేదాల సారాంశాన్ని గ్రహించి హిందూధర్మాన్ని ముందుకు నడిపించాలని కోరారు. ఆలయ ప్రధాన అర్చకులు ధర్మశాస్త్ర సేవా సమితి సభ్యులు, భగత్‌సింగ్‌నగర్ వాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కుత్బుల్లాపూర్: పలు పాఠశాలల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్లో ప్రత్యేక వేషధారణతో చిన్నారుల మధ్య కేక్‌కట్ చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్‌ముదిరాజ్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

- చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని బీపీఎస్ ఒలింపియాడ్ పాఠశాలలో పాఠశాల చైర్మన్ టీవీఆర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో చిన్నారులు ఏంజెల్, శాంతాక్లాజ్ వేషధారణలో ఆకట్టుకున్నారు.



సూరారం నార్త్ సిటీ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ కోలా వెంకటేష్



వేంకటేశ్వరనగర్ బీపీఎస్ ఒలంపియాడ్ పాఠశాలలో..